పారిశుద్ధ్యానికి పాతర

- గుడివాడలో రోడ్లపైనే చెత్త
- 'క్లీన్ గుడివాడ' ఆరంభ శూరత్వమే

గుడివాడ టౌన్: గుడివాడ పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఐ లవ్ గుడివాడ, క్లీన్ గుడివాడ తదితర నినాదాలతో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వ ప్రతినిధులు రెండు నెలల క్రితం రోడ్లు తుడిచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'గుడివాడ వెలిగిపోతుంది.. ఇక అంతా పరిశుభ్రతే' అంటూ కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థలను సైతం భాగస్వాములను చేస్తూ హడావిడి చేశారు. ఐ లవ్ గుడివాడ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించిన సంస్థల నిర్వాహకులకు మొదటి బహుమతిగా రూ.లక్ష, అనుబంధ బహుమతులు అనేకం ఉంటాయని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించారు. కొత్త ప్రభుత్వం, కొత్త నాయకత్వం, ఉరకలు వేస్తున్న ఉత్సాహం కలగలిపి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతారని ప్రజలు భావించారు. అందరూ భ్రమపడ్డారు. ఐ లవ్ గుడివాడ కార్యక్రమం ప్రారంభించిన నెల రోజులపాటు ఆరంభ శూరత్వాలతో పనులు పరుగులు పెట్టించారు. అనంతరం వాటివైపు కన్నెత్తి చూసే నాథుడే కరువయ్యారు.

పల్లపు ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వ

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పలు పల్లపు ప్రాంతాలు నీటమయమయ్యాయి. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో వర్షం నీరు ఇంకిపోలేదు. ఇక రోడ్లపై చెత్త ఎక్కడిదక్కడే నిల్వ చేరింది. డ్రెయిన్లలో చెత్త పేరుకుపోయింది. శానిటేషన్ అధికారులు, సిబ్బంది నామమాత్రంగా పనులు చేస్తున్నారు. ప్రధాన రహదారులైన బస్టాండ్, మార్కెట్ సెంటర్, నెహ్రూ చౌక్, ఏలూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో మాత్రం రోడ్లను ఊడవడం, చెత్త లేకుండా చూడటం చేస్తున్నారే తప్ప శివారు ప్రాంతాలు, ఇతర ప్రాంతాల్లో చెత్త పోగులెత్తే కార్యక్రమం చేపట్టడం లేదు. ప్రతి రోజూ చెత్త ఎత్తే కార్మికులు, వ్యాన్లు తిరుగుతున్నా అవి కొన్ని ప్రాంతాలకే పరిమితం అవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంటింట చెత్త సేకరించే సిబ్బంది ఉన్నారే తప్ప రోడ్లను ఊడ్చేవారు లేకపోవడంతో రహదారులపై చెత్త ఎక్కడికక్కడే పేరుకుపోతోంది. వీటిలోని వ్యర్థాలను తినేందుకు ఆవులు, కుక్కలు సంచరిస్తూ వాటి మలమూత్రాలతో పరిసర ప్రాంతాలను కలుషితం చేస్తున్నాయి. వీటి దుర్గంధం భరించలేక పోతున్నామని స్థానికులు వాపోతున్నారు. దీనికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్డుపై వ్యర్థాలను తింటున్న ఆవు


మున్సిపల్ కార్యాలయం సమీపంలో చెత్తతో నిండిన డ్రెయిన్



రోడ్డుపై వ్యర్థంగా పడివున్న చెత్త సేకరించే బళ్లు

ఎక్కడ నిర్లక్ష్యం జరుగుతుందో..


పారిశుద్ధ్య సమస్యలు పరిష్కారానికి ప్రతి సచివాలయంలో సెక్రటరీలు ఉన్నారు. వారి పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు సైతం అందుబాటులో ఉన్నారు. ఇట్టి పరిస్థితుల్లో చెత్తను తరలించి పరిశుభ్రంగా ఉంచే కార్యక్రమం ఎక్కడ నిర్లక్ష్యానికి గురవుతుందనేది అర్థంకాని ప్రశ్నగా మిగిలిపోయింది. అందరం బాధ్యతగా పనిచేస్తున్నామంటున్నారు. అయితే ఎక్కడి సమస్యలు అక్కడనే ఉంటున్నాయి.

– సురేఖ, స్థానికురాలు

పాములు సంచరిస్తున్నాయి


మేము పామర్రురోడ్డులోని నారయణపురంలో నివసిస్తాం. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మా పరిసర పల్లపు ప్రాంతాలు పూర్తిగా నీళ్లు నిలిచాయి. దుర్గంధం భరించలేకపోతున్నాం. రాత్రిళ్లు దోమలు దండయాత్ర చేస్తున్నాయి. రెండు రోజుల క్రితం నల్లత్రాచు మా ప్రహరీ గోడకు ఉన్న రంధ్రంలో తిష్ట వేసింది. కనీసం నీళ్లు తోడించే కార్యక్రమం లేదా ఖాళీ స్థలాల యజమానులతో మాట్లాడి మెరక చేయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి

– విజయదుర్గ, స్థానికురాలు

మా దృష్టికి తెస్తే పరిష్కరిస్తాం

పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగునకు పూర్తి స్థాయిలో సిబ్బందిని వినియోగిస్తున్నాం. కొన్ని సమస్యలు మా దృష్టికి రావడం లేదు. పారిశుద్ధ్య సమస్యలను మా దృష్టికి తీసుకొస్తే కచ్చితంగా పరిష్కరిస్తాం.

– పి. శ్రీనివాసరావు, ఇన్‌చార్జి కమిషనర్

ప్రభుత్వ కార్యాలయాల వద్ద పారిశుద్ధ్య సమస్య

మండవల్లి: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద పారిశుద్ధ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకచోటే ఉన్నాయి. ఎంపీడీఓ, వ్యవసాయశాఖ, తహసీల్దార్, ఎంఈఓ, వెలుగు కార్యాలయం ఒక చోట పక్క పక్కనే ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో కార్యాలయాలు ఉన్న ప్రదేశం వర్షం నీరు నిలిచిపోయింది. దీంతో కార్యాలయాలకు వచ్చే వారికి ఇబ్బందికరంగా మారింది. వర్షం నీటి కారణంగా పగలే అక్కడ దోమలు బెడద అధికంగా ఉంది.

చెత్త సంపద తయారీ కేంద్రం బయట చెత్త

చెత్త సంపద తయారీ కేంద్రం బయట చెత్త, చెదారం భయంకరంగా కనిపిస్తున్నాయి. స్థానిక చెత్త సంపద తయారీ కేంద్రం బయట ప్రదేశమంతా చెత్త, చెదారాలతో నిండిపోయి దుర్గంధం వెలజల్లుతోంది. వర్షం వస్తే ఆ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో క్రిమి కీటకాలు చేరి ఇబ్బందికరంగా ఉంటుందని పలువురు సిబ్బంది వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ కార్యాలయాల వద్ద పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


మండవల్లి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నిలిచిన వర్షం నీరు

హాస్టల్లో పరిశుభ్రత పాటించండి


కైకలూరు: ప్రభుత్వ వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలని కైకలూరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్ వీవీఎన్‌వీ లక్ష్మీ ఆదేశించారు. ఆటపాక సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. హాస్టల్ వార్డెన్ ఎన్.నాగమణి నుంచి వివరాలు తెలుసుకున్నారు. హాస్టల్లో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేవని పలువురు జడ్జి దృష్టికి తీసుకొచ్చారు. ఇటీవల వరదలకు రెండడుగుల మేర వరద నీరు చేరిందని చెప్పారు. అద్దె భవనం కావడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సమస్యలను జడ్జి నివేదికలో రాసుకున్నారు. ప్యానల్ న్యాయవాదులు డి.శివప్రసాద్, పి.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

తోట్లవల్లూరు: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. వివిధ శాఖల పనితీరుపై ఎంపీపీ రాజామణి సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ రవికాంత్, తహసీల్దార్ కుసుమకుమారి, ఏఓ నాగేశ్వరరావు, హౌసింగ్ ఏఈఈ భవానీప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సుబ్బారావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం

ముదినేపల్లి రూరల్: దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని దేవపూడి విజయదుర్గాంబ రథోత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని శాంతాదేవీగా అలంకరించి, పూజలతో రథోత్సవం నిర్వహించారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

గుడివాడరూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్‌ఐ ఎస్.చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని వలివర్తిపాడు సమీపంలోని బైపాస్‌రోడ్డులో మంగళవారం వాహనాల తనిఖీలను చేపట్టారు. వాహనాల రికార్డులు, లైసెన్స్‌లను తనిఖీ చేశారు. లైసెన్స్‌లు లేని వారికి అపరాధ రుసుం విధించారు.

క్లుప్తంగా

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

గుడ్లవల్లేరు: వ్యక్తిగత పరిశుభ్రతతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలని జిల్లా లయన్స్ మాజీ చైర్మన్ వై.పి.సి.ప్రసాద్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో మంగళవారం గ్లోబల్ వాషింగ్ డేను పురస్కరించుకుని గుడ్లవల్లేరులోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్స్‌ను అందజేశారు. లయన్స్ క్లబ్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ, కార్యదర్శి ఎం.పెరుమాళ్లు, కోశాధికారి కల్యాణపు నవాబు, లయన్స్ ప్రతినిధులు జంగం మోహనరావు, సూరపనేని పరంధామయ్య, చాపరాల బాలాజీ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల జీతాలు పెంచాలి

మండవల్లి: పారిశుద్ధ్య కార్మికుల జీతాలు పెంచాలని సామాజిక కార్యకర్త ఎల్ఎస్ భాస్కరరావు, తెంటు అప్పారావు, త్యాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రజాసమస్యల పరిష్కార వ్యవస్థ నందు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కె.గోపాల్, ఈఓపీఆర్డీ సీహెచ్ శేఖర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నెలకు రూ.6వేలు జీతంగా ఇస్తున్నారన్నారు. కార్మికుల జీతాలపై కూటమి ప్రభుత్వం చర్చించి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


పమిడిముక్కల: గ్రామాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా తెలిపారు. పల్లెపండుగ-పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మేడూరులో రూ.46 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సిమెంట్ రహదారుల నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం హనుమంతపురంలో రూ.19 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఎంపీడీఓ విఠల్‌పాల్, సర్పంచ్‌లు స్వర్ణలత, రాంబాబు, వైస్ ఎంపీపీ మహేష్, టీడీపీ నాయకులు బాబూరావు, శ్రీనివాసరావు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణం వెంటనే చేపట్టాలి

గుడివాడ టౌన్: కూటమి ప్రభుత్వం రోడ్ల నిర్మాణం పనులు వెంటనే చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుడివాడ నియోజకవర్గంలో నందివాడ మండలం, బంటుమిల్లి రోడ్డు, విజయవాడ రోడ్డు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. ఇచ్చిన హామీని దృష్టిలో ఉంచుకుని వెంటనే రోడ్ల నిర్మాణం పనులు పూర్తిచేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు లంకా సురేంద్ర, ఎం.కోటేశ్వరరావు, ఎ.కోటేశ్వరరావు, ఎ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరుద్ర జయంతిని జయప్రదం చేయండి

ప్రముఖ రచయిత ఆరుద్ర శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కె.మోహన్‌రావు కోరారు. సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఈనెల 27వ తేదీన ఆరుద్ర శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సాహితీ వేత్తలతో సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

హామీలను అమలు చేయడమే లక్ష్యం


గుడివాడరూరల్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నూరుశాతం అమలు చేయడమే లక్ష్యంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కృషి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని శేరీదింటకుర్రు, నూజెళ్ల గ్రామాల్లో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులతో కలసి మంగళవారం ఆయన పాల్గొన్నారు. తొలుత రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. ఎంపీడీఓ విష్ణుప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ సూరిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బి.శ్రీకాంత్, టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి

పెదపారుపూడి: మండలాభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని ఎంపీపీ గోగం సురేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యాలయ సిబ్బందితో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీపీ గ్రామాల వారీగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ సీతామహాలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ బేగం పాల్గొన్నారు.

అభ్యసన వైకల్యాన్ని సరిచేయొచ్చు

గుడివాడ టౌన్: ప్రతి విద్యార్థిలోనూ అభ్యసన లోపాలు ఉంటాయని, వాటిని సరిచేయడం కూడా సులువేనని ఎంఈఓ ఐ.విజయ్ అన్నారు. మంగళవారం స్థానిక అల్లంబడిలో దివ్యాంగుల తల్లిదండ్రులు, సాధారణ విద్యార్థులతో అభ్యసన వైకల్యం అనే అంశంపై మాట్లాడారు. విద్యార్థులకు చదవడం, రాయడంలో లోపాలు ఉంటాయని వాటిని గమనించి సరిచేసేందుకు అనేక మార్గాలు ఉన్నాయన్నారు. కార్యాక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: పెదపారుపూడిలో డిస్లెక్సియా నిర్దిష్ట అభ్యసన వైకల్యంపై విద్యార్థులతో మంగళవారం అవగహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురంలో..

పమిడిముక్కల: కపిలేశ్వరపురంలోని భవిత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలో డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హైస్కూల్ హెచ్‌ఎం ప్రభాకరరావు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వర్ధనమ్మ, ఐఈఆర్‌టీలు రజనీకుమార్, అంజనీదేవి తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలి

గుడ్లవల్లేరు: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలని ఎంఈఓలు జి.గోపాలరావు, జగన్‌మోహనరావు అన్నారు. స్థానిక ఎస్ఈఆర్‌ఎం హైస్కూల్లో మంగళవారం డిస్లెక్సియా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థుల్లో సాధారణంగా ఉండే నిర్దిష్ట అభ్యసన వైకల్యాలపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. సహిత విద్య రీసోర్స్ పర్సన్ అబ్దుల్ హమీద్, హెచ్‌ఎం సీహెచ్‌ఎల్‌వీ రమణ, సీఆర్‌ఎంటీలు మాధవరావు, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: అభ్యసన వైకల్యాలపై అవగాహన కల్పించి పిల్లలలో పురోభివృద్ధిని పెంపుదల చేయాలని పామర్రు ఎంఈఓ-2 పద్మవాణి పేర్కొన్నారు. పామర్రు మండల పరిషత్ పాఠశాల, జెడ్పీ పాఠశాల, భవిత కేంద్రాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం డిస్లెక్సియా లోపంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఇందిరరాణి, భవిత కేంద్రం ఉపాధ్యాయులు కె.మరియన్న, కోటేశ్వరరావు, బాలాజీ పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: మండలంలో ప్రత్యేకవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి భవిత సెంటర్ల ద్వారా చికిత్స అందించాలని ఎంఈఓ డి.రామారావు తెలిపారు. అభ్యసన వైకల్యాలను గుర్తించే కార్యక్రమంలో భాగంగా కైకలూరులో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. పాఠశాలల హెచ్‌ఎంలు రామారావు, ఈసా పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: లోకుమూడి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో మంగళవారం డిస్లెక్సియా ఎవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ డి.రామారావు లోకుమూడి హైస్కూల్ హెచ్‌ఎం కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వెంపటి చినసత్యానికి ఘన నివాళి


కూచిపూడి(మొవ్వ): కూచిపూడి నాట్య లెజెండ్ డాక్టర్ వెంపటి చినసత్యానికి ఆయన జయంతి సందర్భంగా మంగళవారం నాట్యక్షేత్రం కూచిపూడిలో కళాకారులు ఘనంగా నివాళులర్పించారు. చినసత్యం స్మృతి సదనంలో ఆయన విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించి నివాళులర్పించారు. కళాపీఠం వైస్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు, పసుమర్తి హరినాథశాస్త్రి, వేదాంతం వెంకట దుర్గా భవాని, లైబ్రేరియన్ ఫణికుమార్ పాల్గొన్నారు.

వరిసాగులో చీడపీడల నివారణ కీలకం

గుడివాడరూరల్: వరి పైరును ఆశించే చీడ పురుగులు, తెగుళ్ల నివారణకు రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ జ్యోతి రమణి రైతులకు సూచించారు. మండలంలోని రామనపూడి, తటివర్రు గ్రామాల్లో మండల వ్యవసాయశాఖ అధికారి బి.అనంతలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మంగళవారం ఆమె ప్రసంగించారు. వరిసాగులో రైతులకు పలు సూచనలు ఇచ్చారు. పైరును కాండం తొలుచు పురుగు, ఆకు ముడత పురుగు ఆశించే ప్రమాదం ఉందన్నారు. ముందస్తుగానే రైతులు జాగ్రత్తలు తీసుకుని పైరును కాపాడుకోవాలని సూచించారు. మోతాదుకు మించిన ఎరువులు, పురుగు మందులతో పంటను పాడు చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఏడీఏ డీఆర్‌సీ సూపర్‌వైజింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, డీఆర్‌సీ ఏఓ బి.పద్మజ, ఏఈఓ వి.అనిత పాల్గొన్నారు.


పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు, అధికారులు

ఓటరుగా నమోదు చేసుకోండి

ముదినేపల్లి రూరల్: పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల నమోదుకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసినందున సద్వినియోగం చేసుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా నాయకుడు బేతాళ రాజేంద్రప్రసాద్ కోరారు. ఇందుకు సంబంధించి సంఘం ఆధ్వర్యంలో ముదినేపల్లిలో ఓటర్ల నమోదు కేంద్రాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు.
అర్హులైన వారు ఆధార్, ఓటర్‌కార్డు, డిగ్రీ సర్టిఫికెట్, ఫొటో వెంట తెచ్చుకుని నమోదు చేయించుకోవాలని కోరారు.

భూవివాదంపై విచారణ

ముదినేపల్లి రూరల్: మండలంలోని వైవాకలో ఇద్దరి మహిళలకు సంబంధించి ఏర్పడిన భూవివాదంపై తహసీల్దార్ సుభానీ మంగళవారం విచారణ నిర్వహించారు. గ్రామానికి చెందిన కుర్మ జ్ఞాన సుందరమ్మకు చెందిన 1.29 ఎకరాల అసైన్డ్ భూమి అన్యాక్రాంతం అయిందని సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేయగా దీనిపై విచారణ జరపాలంటూ తహసీల్దార్‌ను సీఎం కార్యాలయ అధికారులు ఆదేశించారు. ఈ మేరకు జ్ఞాన సుందరమ్మతో పాటు భూమిని ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నట్లు ఆరోపించబడిన కాగిత వెంకట సుబ్బమ్మను తహసీల్దార్ విచారించారు.

పంట నమోదు జాబితాల ప్రదర్శన

గుడ్లవల్లేరు: పంటలు సాగు చేస్తున్న రైతుల వివరాలను రైతు సేవా కేంద్రాల్లోని నోటీసు బోర్డుల్లో ప్రదర్శిస్తున్నామని ఏఓ ఎల్.సునీల్ తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని 17 రైతు సేవా కేంద్రాల్లో జాబితాలను నోటీసు బోర్డుల్లో ప్రదర్శించారు. జాబితాల వివరాలపై అభ్యంతరాలున్న వారు ఎవరైనా ఉంటే 16వ తేదీలోగా తెలియజేయాలని పేర్కొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం-చేపూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్ర శర్మ ఆధ్వర్యంలో సుబ్బారాయుడికి ఈ అభిషేకాలు నిర్వహించారు.

■ గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


ముదినేపల్లిలో సీసీరోడ్డుకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కామినేని

ముదినేపల్లి రూరల్: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ముదినేపల్లి, కోడూరు, పెదపాలపర్రు, శ్రీహరిపురం, దాకరం గ్రామాల్లో మంగళవారం పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించారు. వీటిలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని సీసీ రోడ్లకు భూమి పూజ చేసి మాట్లాడారు. సర్పంచ్‌లు నిమ్మగడ్డ కైకమ్మ, పరసా విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

పెదమద్దాలి(పామర్రు): పెదమద్దాలి గ్రామంలోని ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద మంగళవారం అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానికులు దొక్కు కోటయ్య అండ్ సుబ్రహ్మణ్యేశ్వర అభినందన ట్రస్టు ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. పంచాయతీ ఈఓ పూర్ణచంద్రరావు కలాం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం లక్ష్మీకుమారి, ట్రస్టు అధినేత దొక్కు సుబ్రమణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు: మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా మంగళవారం పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. కూటమి నేతలు పూల రాజీ, జానీ, ఉస్మాన్, గఫూర్, వేములపల్లి కారుణ్య, వాసు, బాజానీ ఖాన్, పాల్గొన్నారు.

■ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

గుడివాడ టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కార్మికుల సంక్షేమానికి అనేక వాగ్దానాలు చేసిందని, వాటిని నిలబెట్టుకోవడం లేదని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.కొండ అన్నారు. స్థానిక ఏలూరు రోడ్డులోని గౌరీశంకర సెంటర్‌లో భవన నిర్మాణ కార్మికులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక రేట్లు గత ప్రభుత్వంలో కన్నా కూటమి ప్రభుత్వంలో అధికమయ్యాయన్నారు. తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఓలేటి సీతారామయ్య, నాయకులు తంబి, ఎం.నారాయణ, రమేష్‌బాబు, పండు పాల్గొన్నారు.

■ తాగునీటి నమూనాల సేకరణ

గుడివాడరూరల్: నియోజకవర్గంలోని 44 గ్రామాల్లో తాగునీరు రంగు మారి తీవ్ర సమస్యగా ఉందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కంకిపాడులో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన తాగునీటిని వెంటనే పరీక్షించి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ ఏపీడీడబ్ల్యూఎస్సీ, ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజినీర్ హరిరామ్‌నాయక్ ఆదేశాల మేరకు మంగళవారం నందివాడ, గుడివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో తాగునీటిని పరిశీలించేందుకు 44 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వచ్చి ఆయా మండలాల్లో తాగునీటి శాంపిల్స్ సేకరించారు.

■ సీసీ రోడ్లకు శంకుస్థాపన

నిమ్మలూరు(పామర్రు): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసినట్లు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ తెలిపారు. మండలంలోని నిమ్మలూరులో సీసీ రహదార్ల ఏర్పాటుకు మంగళవారం భూమిపూజను చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు రత్నకుమారి, నిమ్మలూరు సర్పంచ్ గోపాలం, ఎంపీడీఓ జ్యోతి, పీఆర్ ఏఈ రామారావు పాల్గొన్నారు.

■ 10 మంది వార్డు సభ్యుల రాజీనామా

కైకలూరు: సర్పంచ్ దానం నవరత్నకుమారిపై పలు ఆరోపణలు చేసినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోపోవడాన్ని నిరసిస్తూ కైకలూరు పంచాయతీకి చెందిన 10 మంది వార్డు సభ్యులు ఏలూరులో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి మంగళవారం రాజీనామా పత్రాలను సమర్పించారు. రాజీనామాలు సమర్పించిన వారిలో అమన్నా కౌసర్, జయ సుధారాణి, శివరమ్య, రాజామణి, నాంచారయ్య, శ్రీనివాసరావు, వెంకట నరసింహమూర్తి, శ్యామలరావు, జ్యోతి, సమతం శ్రీను ఉన్నారు.

■ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత


కైకలూరు: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పేర్కొన్నారు. మండలంలోని వదర్లపాడులో దేవీ శరన్నవరాత్రులు ముగించుకుని అఖండ అన్నసమారాధన మంగళవారం నిర్వహించారు. డీఎన్నార్ ప్రత్యేక పూజలు చేశారు. నాయకుడు సురేష్ పాల్గొన్నారు.

■ స్థల వివాదంపై ఆర్డీఓ విచారణ

నిడుమోలు(మొవ్వ): నిడుమోలు జాతీయ రహదారిపై ఉన్న స్థల వివాదంపై జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదేశాల మేరకు ఉయ్యూరు ఆర్డీఓ బీఎస్ హేల షారోన్ అధికారులతో కలిసి మంగళవారం గ్రామంలో విచారణ నిర్వహించారు. గతంలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా స్థానిక చెక్ పోస్ట్ సమీపంలో బత్తిన ఈశ్వరరావు తన స్థలాన్ని కోల్పోయాడు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందకపోవటంతో బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. అనంతరం ఆ స్థలంలో ఆర్‌ఓ ప్లాంట్ నిర్మించుకున్నాడు. అధికారుల విచారణలో ఆ స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లను చూపించాలని ఈశ్వరరావుని కోరారు. డాక్యుమెంట్లు తన లాయర్ వద్ద ఉన్నాయని మూడు రోజుల్లో చూపించగలనని తెలిపారు. విచారణలో సేకరించిన విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయనున్నటు తెలిపారు. తహసీల్దార్ మస్తాన్, రహదారి సర్వేయర్ శ్యామ్, మండల సర్వేయర్ కిషోర్, ఇన్‌చార్జి వీఆర్వో రవి పాల్గొన్నారు.